క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శనను ఆదరించాలి



చేనేత వస్త్ర ప్రదర్శనకు హాజరైన అతిథులు

డాబాగార్డెన్స్: చేనేత వస్త్రాల విక్రయాలకు ప్రాధాన్యమిస్తూ, మహిళా సాధికారతకు సహకరిస్తున్న వసుంధర డైమండ్ రూఫ్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి తొట్టెంపూడి చొరవ అభినందనీయమని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పల్లవి పేర్కొన్నారు. నగరంలోని గ్రీన్‌పార్క్ హోటల్లో వసుంధర డైమండ్ రూఫ్ ఆధ్వర్యంలో ఆభరణాలు, చేనేత వస్త్రాల ప్రదర్శనను ఆమె ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. రెండు (28, 29) రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనను ప్రజలు ఆదరించాలన్నారు. మరో ప్రముఖ వైద్యురాలు శ్రీదేవి మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో చెన్నైకి చెందిన చిత్రాలూమ్స్ సంస్థ సాంప్రదాయబద్ధమైన కాంచీవరం చీరలు ఎంతో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. వసుంధర డైమండ్ రూఫ్ అధినేత శ్రీదేవి తొట్టెంపూడి మాట్లాడుతూ గత 28 ఏళ్లుగా విశిష్ట కళాత్మకతతో ఆభరణాలు విక్రయిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నామన్నారు. కార్యక్రమంలో చిత్రాలూమ్స్ ప్రతినిధి మనుశంకర్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలల్లో ఇష్టారాజ్యం

మహారాణిపేట: నగరంలో జరుగుతున్న సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ బదిలీల్లో విధానపరమైన లోపాలు ఉన్నాయని, పారదర్శకత లోపించిందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మర్రి శేషుబాబు ఆరోపించారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా జరగాల్సిన ఈ బదిలీలు కొందరు అధికారుల ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని, ఇది ఉద్యోగుల న్యాయ హక్కులను ఉల్లంఘించడమేనని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియారిటీ జాబితా విడుదల చేయకుండానే బదిలీలు ప్రారంభించడం అన్యాయమని శేషుబాబు అన్నారు. ఉద్యోగుల నుంచి ఆప్షన్ ఫారం అడుగుతూనే, వారి నిర్ణయంతో సంబంధం లేకుండా అధికారులు బలవంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని, ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేవీ దుర్గా ప్రసాద్, జాయింట్ సెక్రటరీ బి. పాండురంగ, కోశాధికారి చింతకాయల బంగరరాజు డిమాండ్ చేశారు.

రాంజీ ఎస్టేట్‌లో పేదలకు అన్నదానం

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో పేదలకు శనివారం అన్నసమారాధన నిర్వహించారు. దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు గొల్లమాల అప్పారావు అన్నదానం చేశారు. సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని గొల్లమాల అప్పారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి వెంకటరావు, భీర భైరవమూర్తి, బొత్స అప్పారావు, టేకి గణేష్, అన్ను సుబ్రమణి, నీళ్ల గణేష్, ధనాల అప్పారావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మంచినీళ్లు మహా ప్రభో..



నీరు లేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్న మహిళలు



ఎంజీఎం హైస్కూలు బోరింగ్ వద్ద నీటి కోసం వేచి ఉన్న వృద్ధులు

- నీరు రాక జనం ఇబ్బందులు
- నీటి సరఫరా సిబ్బంది సమ్మెతో కుళాయిలు బంద్
- బోర్ల వద్దకు జనం పరుగులు



బంగారుమెట్ట కాలనీలో నీటి కోసం వేచి ఉన్న మహిళలు

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గం పరిధిలో శుక్రవారం, శనివారం నీరు రాక జనం నానా అవస్థలు పడ్డారు. జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఔట్ సోర్సింగ్ సిబ్బంది వారి సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఇది శనివారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. దీంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నుంచి శనివారం సాయంత్రం వరకు పూర్తిగా నీటి సరఫరా నిలిపేశారు. సమ్మె విరమించి శనివారం సాయంత్రం నీటి సరఫరా చేసినప్పటికీ అన్ని ప్రాంతాలకు సక్రమంగా జరగలేదు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. మరికొన్ని ప్రాంతాల్లో కుళాయిలు విడిచిపెట్టినా.. రద్దీ పెరిగి అందరికీ సరిపడినంత నీరు లభించక ఇబ్బంది పడ్డారు. సమయం కాని సమయంలో నీరు విడిచిపెట్టడం వల్ల ఆఫీసులు, పనులకు వెళ్లిన వారు, ఏదో ఒక పని మీద ఇల్లు విడిచి వెళ్లిన వారు నీరు పట్టుకోలేకపోయారు. వాటర్ ట్యాంక్‌ల కోసం ఫోన్ చేస్తే వాటర్ లేదంటున్నారు. అదృష్టం బాగుండి ట్యాంకు దొరికినా అవసరాన్ని బట్టి వారు కూడా ధరలు పెంచేశారు. డిమాండ్ పెరగడంతో సందట్లో సడేమియా అన్నట్లు ప్రైవేట్ వాటర్ సరఫరా దారులు నచ్చిన ధరలు చెబుతున్నారు.

బోరింగులకు డిమాండ్..

వీధుల్లో అక్కడక్కడ ఉన్న ఒకటీ అరా బోరింగ్‌లే ఈ సమయంలో జనానికి దిక్కయ్యాయి. వాటి దగ్గర క్యూలు కనిపించాయి. ఎవరి వంతు వచ్చే వరకు వారు వెయిట్ చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. వీధి కుళాయిలు ప్రతి వీధిలోను, ఇంటింటికీ ఏర్పాటు చేయడంతో కొన్ని బోరింగులను పూర్తిగా నిర్వీర్యం చేసేశారు. ఉన్న బోరింగ్‌ల వద్ద ఉదయం నుంచి క్యూలు కట్టారు. బోరింగ్‌ల వద్ద నీటిని పట్టుకుని వాహనాలపై తీసుకెళ్లారు. ఇంకా ఎన్నాళ్లు ఈ కష్టాలని వారు వాపోతున్నారు.



దూరాభారం నుంచి నీటిని మోసుకొస్తున్న మహిళ

వారాంతం కావటంతో..

వారం రోజుల పాటు పనులు, ఉద్యోగాలు చేసుకునే వారు వారాంతంలో శనివారం, ఆదివారాల్లో బట్టలు ఉతుక్కుంటారు. పైగా శనివారం రోజున ఇంటిని శుభ్రం చేసుకుంటారు. కానీ శనివారం నీళ్లు రాకపోవటంతో ఇబ్బందులు పడ్డారు. ఎక్కడి పనులు అక్కడే ఉండిపోయాయని నిట్టూర్చారు.

రెండు రోజులుగా కుళాయిలు రావటం లేదు



రెండు రోజులుగా మంచినీటి కుళాయిలు రావటం లేదు. నీటి సరఫరా సిబ్బంది వారి సమస్యల పరిష్కారం కోసం కుళాయిలు విప్పడం మానేశారు. కనీసం వాడకానికి కూడా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న నీళ్లు కాస్త ఉదయానికి సరిపోయాయి. స్నానాలు చేయకుండా కూర్చున్నాం.

– మంగం పార్వతి, బంగారుమెట్ట

బోరింగుల నుంచి నీరు తెచ్చుకుంటున్నాం



తాగటానికి, నిత్యావసరాల కోసం నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. బోరింగ్‌లు ఉన్న వారి వద్ద నుంచి బ్రతిమిలాడుకుని నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీవీఎంసీ అధికారులు ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుకుంటున్నాం.

– ఎం.లక్ష్మి, అల్లిపురం

చంటి పిల్లలతో ఇబ్బంది పడుతున్నాం



రెండు రోజులుగా నీళ్లు లేక ఇబ్బంది అవుతుంది. ముఖ్యంగా చిన్న పిల్లలుండడం వల్ల నీటి అవసరం అధికంగా ఉంటుంది. శనివారం, ఆదివారం వచ్చిందంటే వారం రోజుల బట్టలు ఉతుక్కునే పని పెట్టుకుంటాం. నీళ్లు రాక బట్టలు అలాగే ఉండిపోయాయి.

– వరలక్ష్మి, బంగారుమెట్ట

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌తో ప్రజా సమస్యల పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏర్పడిందని కౌన్సిల్ వ్యవస్థాపకుడు మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట ఏర్పడిన హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రజల ఎన్నో సమస్యలు పరిష్కరించిందన్నారు. జూలై 12న కౌన్సిల్ 26వ వార్షికోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా ఆ రోజు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, జాతీయ స్థాయిలో చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టేందుకు ఈ సమావేశంలో చర్చించినట్టు చెప్పారు. ప్రజల సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలని సమావేశంలో చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరావు, సూర్య, శ్రీనివాసరావు, వైకుంఠరావు, ఎస్వీ రమణ, మల్లేశ్వరరావు, న్యాయవాది లక్ష్మి, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపుల లీకేజీ



మహారాణి పార్లర్ వద్ద లీకవుతున్న నీరు

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో మహారాణి పార్లర్ వద్ద మంచినీటి పైపులు లీకవుతున్నాయి. పైపులకు రంధ్రాలు పడటంతో మూడు చోట్ల నుంచి నీరు నెమ్మదిగా లీకవుతూ రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల తారురోడ్డు కింద ఉన్న పైపులు పగలడం గాని రంధ్రాలు పడటం గాని జరిగి నీరు లీకయ్యే అవకాశముందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృధాను అరికట్టాలని కోరుతున్నారు.

ప్రత్యేక అలంకరణలో వారాహి మాత



స్వప్న వారాహి మాత అలంకరణలో వారాహి మాత



అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: శ్రీమేరు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వారాహి నవరాత్రులు గురువారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు స్వప్న వారాహి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు దీక్షాధారులు అమ్మవారికి ఉదయం, సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో అల్లిపురం, వివేకానందకాలనీ, నీలమ్మ వేపచెట్టు తదితర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు.


'దళిత, గిరిజనులపై దౌర్జన్యాలు పెరిగాయి'



మాట్లాడుతున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిరంజీవి

డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళిత, గిరిజనులపై దౌర్జన్యాలు, దుర్మార్గాలు పెరిగిపోయాయని, వీటిని ఎదుర్కోడానికి పకడ్బందీ చర్యలు తీసుకోకుండా, పోలీస్ వ్యవస్థలో ఉన్న ఎస్సీ, ఎస్టీ సెల్ తీసేయడం దుర్మార్గమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుకోటి చిరంజీవి ఆరోపించారు. వెంటనే ఎస్సీ, ఎస్టీ సెల్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళలను గంటన్నర పాటు మానసికంగా హింసించి, ఫిర్యాదు ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేసిన నాల్గో పట్టణ సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఎం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయనతో పాటు పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకరరావు మాట్లాడుతూ పట్టు వదలకుండా ధైర్యంగా నిలబడిన గిరిజన మహిళను అభినందించారు. వారికి న్యాయం జరిగే వరకు మీకు తోడుగా ఉండి, ఏ పోరాటానికైనా సిద్ధంగా ఉంటామన్నారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ దళిత, గిరిజన సమస్యల పరిష్కారం పట్ల అంబేడ్కర్ మిషన్ సొసైటీ కట్టుబడి ఉందని, ఐక్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా వర్కింగ్ ఉమెన్ ప్రధాన కార్యదర్శి పి.మణి మాట్లాడుతూ గిరిజన మహిళకు జరిగిన అన్యాయానికి న్యాయం జరిగే వరకూ వారితో ఉంటామని, ఒక మహిళ హోమ్ మినిస్టర్‌గా ఉన్న ఈ రాష్ట్రంలో మహిళలు ఫిర్యాదు చేస్తే తీసుకోకపోవడం ఎంత వరకు న్యాయమో హోం మినిస్టర్ చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ మాట్లాడుతూ బలహీన వర్గాల పట్ల సానుభూతి చూపాలే తప్ప వారిని వేధించడం పోలీసులకు తగదన్నారు. సమావేశంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల సుబ్బన్న, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.సంతోషం, మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి చంద్రశేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు గౌరెస్, జిల్లా పౌర గ్రంథాలయ నాయకుడు బీఎల్ నారాయణ, పీఎన్ఎం నాయకుడు ఈశ్వరరావు, ఆవాజ్ నాయకుడు అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కోండి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల మహిళా సాధికారిత సెల్ ఆధ్వర్యంలో 'బియాండ్ బుక్స్.. కల్టివేటింగ్ సైకాలజికల్ వెల్‌నెస్ ఇన్ కాలేజ్' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకురాలు, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నివేదిత విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా, దృఢంగా ఉండి, నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనాలని సూచించారు. స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్, బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఎడ్యుకేషనలిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ పద్మాక్షీ లోకేష్ ఎమోషనల్ ఇంటెలిజెన్స్, టైం మేనేజ్‌మెంట్, మెంటల్ హెల్త్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత సెల్ కన్వీనర్ ఎస్.అనురాధ, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ ప్రసన్న, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

మైక్రో సర్జరీతో దెబ్బతిన్న బొటన వేలికి చికిత్స



మాట్లాడుతున్న సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ అంజలి పాప్లే

మహారాణిపేట: కర్మాగారంలో ప్రమాదం వల్ల తీవ్రంగా గాయపడిన బొటన వేలుకు మైక్రో సర్జరీ నిర్వహించి కాపాడినట్లు ఎంజీఎం హెల్త్ కేర్ సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ అంజలి పాప్లే, డాక్టర్ సుమిత్ర తెలిపారు. శనివారం ఎంజీఎం హెల్త్ కేర్ సెవెన్ హిల్స్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ అంజలి పాప్లే మాట్లాడారు. అలాగే ఆస్పత్రి డీజీఎం అశోక్ పట్నాయక్ మాట్లాడుతూ అంజలి నేతృత్వంలో అయిదు గంటల మైక్రో సర్జరీలో ఎముకలు కలపడం, నరాలు జత చేయడం, రక్తనాళాలు పునర్నిర్మించడం వంటి క్లిష్ట ప్రక్రియ ద్వారా చికిత్స అందించామన్నారు. 30 ఏళ్ల సుభాష్ చంద్ర ఎడమ చేతి బొటన వేలు పూర్తిగా దెబ్బతిందని, మైక్రో సర్జరీ ద్వారా గాయపడిన ఏరియాను పూర్తిగా తొలగించినట్టు వివరించారు. నిలిచిపోయిన రక్త ప్రసరణను పునరుద్ధరించడం, విస్ఫోటం వల్ల గాయమైన ప్రాంతానికి సర్జరీలో ఫ్లాప్ చేయాల్సి వచ్చిందన్నారు. రెండు సర్జరీల తర్వాత బొటన వేలును రక్షించగలిగినట్లు తెలిపారు. ఇప్పుడు సుభాష్ చంద్ర ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో వైద్యులు డీజీఎం (ట్రేడ్) వై.రమేష్, ఏజీఎం ఆపరేషన్స్ ఎ.శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులకు మంచి సినిమా అందించడమే లక్ష్యం

తాటిచెట్లపాలెం: ప్రేక్షకులకు మంచి సినిమాను అందించడమే ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ముఖ్య ఉద్దేశమని సొసైటీ సదరన్ రీజియన్ వైస్ ప్రెసిడెంట్ శశిధర అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సీతమ్మధారలోని ఓ ప్రైవేట్ హాల్లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రెండేళ్లలో చేపట్టబోయే కార్యక్రమాలు, జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణ, సొసైటీ బలోపేతానికి తీసుకోవలసిన అంశాలపై చర్చించారు. ఆంధ్ర తెలంగాణ, బెంగళూరు ప్రాంతాల్లో మంచి సినిమాలు ప్రోత్సహించడమే లక్ష్యంగా దక్షిణాది రాష్ట్రాల ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రాబోయే కాలంలో విశాఖ వేదికగా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా 35 చిత్రంలో ఉత్తమ బాల నటుడిగా గద్దర్ అవార్డు అందుకున్న నటుడిని ఫిల్మ్ సొసైటీ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో వీఎఫ్ఎస్ అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వర్రావు గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ బి.చిన్నారావు, ఫెడరేషన్ సెక్రటరీ ప్రకాష్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శేషాద్రి, ట్రెజరర్ మహేష్ ఫిల్మ్, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ఉషారాణి, ట్రెజరర్ హంస్సేన్, జాయింట్‌సెక్రటరీ బాబూరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఆర్ శివకుమార్, గణేశ్వర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అడ్డా 36వ వార్డు



వాసుపల్లిని సత్కరిస్తున్న వార్డు అధ్యక్షుడు అబ్దుల్ షకీల్, నాయకులు

డాబాగార్డెన్స్: నియోజకవర్గంలోని 36వ వార్డు వైఎస్సార్‌సీపీ అడ్డా అని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో శనివారం 36వ వార్డు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టేలా ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 2.0 విధానంతో ముందుకు వెళ్తున్నారని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అభిమాన కార్యకర్తలు ఉన్న వార్డులో నూతన అధ్యక్షుడిగా నియమితులైన మహ్మద్ అబ్దుల్ షకీల్‌కు వాసుపల్లి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సౌత్ చేనేత విభాగం అధ్యక్షురాలు కాకి పద్మ, సౌత్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కడియం ప్రసాద్, సాగర్, జమీల్, కిషోర్, చెన్నా శ్రీధర్, శత్రువు, సత్యం, స్వప్న, భాను, కనకమహాలక్ష్మి, జాహరా ఫరాలి, ఎండీ మోహరుల్లా, అనీస్, క్రజో, డి.లియాక్వాట్, షోబిర, డాక్టర్ అజిజోలువా, కె.సుబ్రహ్మణ్యం, కె.మాధవ, కె.రాజు, ఎండీ సలీం, అనీస్, షాబీర్ మహ్మద్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్ తదితరులు



మాట్లాడుతున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి శనివారం పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో కేవీ శర్మ నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వృద్ధులు, పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. పీవీ నరసింహారావు భారతదేశానికి ఎనలేని సేవలు అందించారని, ఆయన ఒక మహోన్నత వ్యక్తి అని జహీర్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో పీవీ నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రాఘవేంద్రరావు, మిశ్రా, శ్రీనివాసరావు, జగన్మోహన్, కపిల్ అగర్వాల్, దేవి శర్మ, అరుణ్ భాస్కర్ పాల్గొన్నారు.

పీవీ సేవలు నిరుపమానం..

మహారాణిపేట: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవలు నిరుపమానమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ్ అన్నారు. పీవీతో తన తాత ద్రోణంరాజు సత్యనారాయణ, తండ్రి ద్రోణంరాజు శ్రీనివాస్‌లకు సత్సంబంధాలు ఉన్నాయని వివరించారు. పీవీ జయంతి సందర్భంగా విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీవత్సవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యావతారంలో జగన్నాథుడు



ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డికి పట్టు వస్త్రాలు అందజేస్తున్న సంపత్ వినాయగర్ దేవస్థాన వ్యవస్థాపక ఫ్యామిలీ సభ్యుడు టీఆర్ చోళన్, ఆలయ ఈవో ప్రసాద్

డాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీలో కొలువైన జగన్నాథ స్వామి శనివారం మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5 నుంచి 6 వరకు స్వామివారికి మేలుకొలుపు, నాదస్వరం కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 6, రాత్రి 9:30 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జగన్నాథస్వామి ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో ఫెస్టివల్ ఆఫీసర్ టి. అన్నపూర్ణతో పాటు పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, ఏడిద సురేషుబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సంపత్ వినాయగర్ దేవస్థానం తరఫున దేవస్థాన వ్యవస్థాపక ఫ్యామిలీ సభ్యుడు టీఆర్ చోళన్, సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీవీ ప్రసాద్, టి.రాజేశ్వరన్ పట్టు వస్త్రాలు సమర్పించారు. రథయాత్రలో భాగంగా ఆదివారం జగన్నాథస్వామి కూర్మావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.